క్లుప్తంగా

నవోదయ హాల్‌టికెట్ల పంపిణీకి సిద్ధం

ఉదయగిరి: ఈ నెల 29న జరిగే జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష హాల్‌టికెట్లను సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల వద్ద పంపిణీకి సిద్ధంగా ఉంచినట్లు ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పాఠశాలల్లో హెచ్‌ఎంలను కలిసి హాల్‌టికెట్ పొందాలన్నారు. ఈ పరీక్ష ఉదయం 11.20 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందన్నారు. విద్యార్థులు పదిన్నరకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

బయోమెట్రిక్ హాజరు వేయాలి

ఉదయగిరి: మండలంలోని గ్రామ సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు నూరు శాతం వేయాలని ఎంపీఈఓ ఐజాక్‌ప్రవీణ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు నాడు-నేడు పనులపై దృష్టి సారించాలన్నారు. సచివాలయ సిబ్బంది విధులపై అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

నాడు-నేడు పనులు వెంటనే ప్రారంభించాలి

వరికుంటపాడు: మండలంలోని బోగ్యంవారిపల్లె ప్రాథమిక పాఠశాలలో అర్ధంతరంగా ఆగిపోయిన మనబడి నాడు-నేడు పనులను వెంటనే ప్రారంభించాలని ఎంపీడీఓ విజయభాస్కరరావు సూచించారు. ఆయన శుక్రవారం పాఠశాలలో ఎంఈఓ షాఉద్దీన్‌తో కలిసి పీఎంసీ కమిటీ సభ్యులు, హెచ్‌ఎంతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పాఠశాలలు పునః ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు అన్ని వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగార్జున ఉన్నారు.

ఉపాధి పనుల్లో కూలి గిట్టుబాటు కావాలి



బట్టేపాడులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఆత్మకూరురూరల్: ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న రోజువారీ కూలీలు కనీస కూలి రూ.271 తగ్గకుండా పని చేయాలని ఆత్మకూరు ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని బట్టేపాడులో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలని వేసవి తీవ్రత అధికంగా ఉన్నందున షెల్టర్ల ఏర్పాటు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ తదితర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఏపీఓ శిరీషారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ రవితేజ పాల్గొన్నారు.

నాడు-నేడు పనులపై సమీక్ష

అల్లూరు: మనబడి నాడు-నేడు కింద రెండో విడతకు సంబంధించి శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీదేవి మాట్లాడుతూ నాడు-నేడు కింద రెండో విడతలో అల్లూరు మండలంలోని 35 పాఠశాలలు ఎంపికయ్యాయని, వాటిల్లో అన్ని పాఠశాలలకు నిధుల లభ్యత ఉన్న దృష్ట్యా మంజూరు కాబడిన పనులను వేగవంతంగా పూరి చేయాలన్నారు. 35 పాఠశాలలకు రూ.9,47,47,000 మంజూరయ్యాన్నారు. పాఠశాలలు వేసవి సెలవుల అనంతరం తిరిగి ప్రారంభించేలోగా నాడు-నేడు పనులను పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు ఉండేలా చూడాలన్నారు. పనుల్లో ఎటువంటి అవకతవకలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవాల్సిం టుందన్నారు. ఎంఈఓ నాగేశ్వరరావు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

నిమ్మచెట్లు దగ్ధం



దగ్ధమైన నిమ్మచెట్లు

- రూ.2.50 లక్షల ఆస్తినష్టం

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం నెర్దనంపాడుకు చెందిన ఇందేలా ఓబుల్‌రెడ్డి, ఇందేల దశరథరామిరెడ్డి అనే రైతులకు చెందిన 50 నిమ్మచెట్లు అగ్నికి ఆహుతైన ఘటన శుక్రవారం జరిగింది. బాధితుల కథనం మేరకు.. తమ నిమ్మతోట పక్కనే ఉన్న జామాయిల్ తోట రైతు తన పొలంలో నిప్పుపెట్టి ఆర్పకుండా వెళ్లడంతో మంటలు పెద్దగా వ్యాపించి నిమ్మతోట దగ్ధమైందని ఆరోపించారు. తమ పొలంలో ఉన్న బోరుబావి మోటార్ల ద్వారా మంటలను అదుపు చేశామని అప్పటికే రూ.2.50 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

సీతారామపురం తహసీల్దార్ బదిలీ

నెల్లూరు(అర్బన్): సీతారామపురం తహసీల్దార్ శ్యామసుందరరాజును విడవలూరు తహసీల్దార్‌గా బదిలీ చేశారు. ఈ మేరకు కలెక్టర్ హరినారాయణన్ ఉత్తర్వులను శుక్రవారం జారీ చేశారు.

ప్రజల ముంగిటకే సంక్షేమ ఫలాలు

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి

చేజర్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలు ప్రజల ముంగిట్లోనే అందిస్తున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని పాడేరు సచివాలయ పరిధిలోని గొల్లపల్లి మెయిన్, ఎస్సీ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత మహిళలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు ఘన స్వాగతం పలికారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌ను అందజేశారు. కాలనీలో డ్రైనేజీ సమస్య ఉందని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సచివాలయ పరిధిలో ప్రజలకు రూ.10 కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు సంక్షేమ పథకాల రూపంలో అందజేశారని, మిగిలిన అభివృద్ధి పనులన్నింటని కలుపుకుంటే రూ.20 కోట్ల మేర ప్రతి సచివాలయ పరిధిలో ఖర్చు చేసినట్లుగా చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి తన పాలనలో అందజేసిన సంక్షేమ పథకాల మొత్తాన్ని వారికి చదివి వినిపించారు. ప్రతి ఇంటా సంక్షేమం అభివృద్ధి జరగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షిస్తున్నారన్నారు. ప్రజల మద్దతు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్కలంగా ఉందన్నారు. మరోమారు ఆశీర్వదించేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ తూమాటి విజభాస్కర్‌రెడ్డి, జేసీఎస్ కో-ఆర్డినేటర్ పూనూరు గంగాధర్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ సిరాజుద్దీన్, అట్రాసిటీ మెంబర్ ఎర్రగుంట పెంచలయ్య, మోడేపల్లి పెంచలనాయుడు, వైస్ ఎంపీపీ తిరుపతినాయుడు, సర్పంచ్ వి.జయంతి, నాయకులు ఉడతా చిన రత్తయ్య, రవీంద్రనాయుడు, ఉడతా హజరత్తయ్య, గోనుగుంట రాంబాబు, వెంకటరత్నం, సయ్యద్ కాలేషా, బి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఉజ్వల భవిష్యత్



కొత్తబంగారుపాలెంలో పథకాల బుక్‌లెట్స్ అందిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: తీరప్రాంత గ్రామాల అభివృద్ధితో పాటు ప్రతీ మత్స్యకారుడికి ఆర్థిక భద్రత కల్పించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలు అమలు చేస్తున్నట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి అన్నారు. తీరప్రాంత గ్రామమైన కొత్తబంగారుపాళెంలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్థానిక సమస్యలు తెలుసుకుని పరిష్కారంపై ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తీరప్రాంత గ్రామాలు, మత్స్యకారుల సంక్షేమానికి దేశంలో ఎక్కడా లేని విధంగా నిధులు వెచ్చిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అందులో భాగంగానే జువ్వలదిన్నె వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఫిషింగ్ హార్బర్ అందుబాటులోకి వస్తే స్థానిక యువత ఉపాధి కోసం, వేట కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. మత్స్యసంపదకు కూడా గిట్టుబాటు ధర లభించడంతో భరోసా లభిస్తుందని వివరించారు.

తీరంలో ఘనస్వాగతం

గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తీరంలో పర్యటించిన ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. ప్రతి ఇంటి వద్ద ఎమ్మెల్యేకి హారతులతో స్వాగతం పలికి దిష్టి తీశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తమ జీవితాల్లో వచ్చిన మంచి మార్పులను ఎమ్మెల్యేకి వివరించి నిండు మనస్సుతో ఎమ్మెల్యేని, ప్రభుత్వాన్ని ఆశీర్వదించారు.

పని జరగని ఫలకాలు ఎందుకు?

- ప్రజలను మధ్య పెట్టేందుకే టీడీపీ హడావుడిగా ఏర్పాటు
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



పార్టీలో చేరిన కార్యకర్తలకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: టీడీపీ హయాంలో ఎన్నికలకు ముందు ఎటువంటి పనులు చేయకుండానే ప్రచార ఆర్భాటం కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకాలు తొలగించమని ప్రజలే కోరుతున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైకుంఠపురంలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల కోసం దేశంలో ఏ రాష్ట్రం వినియోగించని స్థాయిలో నిధులు వెచ్చించిందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి పథకాలు అందాలనే లక్ష్యంతో పారదర్శకంగా ఉండేలా వలంటీర్లు, సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు లబ్ధిదారులకు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ వైఖరిని ఎండగట్టారు. ఎన్నికలకు మూడు నెలల ముందు ఎటువంటి పనులు చేయకుండానే ప్రజలను మభ్యపెట్టే ఉద్దేశంతో విచ్చలవిడిగా శిలాఫలకాలు ఏర్పాటు చేసిందన్నారు. పనులు చేయకుండా ఏర్పాటు చేసిన శిలాఫలకాలు దిష్టిబొమ్మల్లా మిగలడంతో ప్రజలే వాటిని తొలగించాలని కోరుతున్నారని తెలిపారు. గత ఎన్నికల్లో టీడీపీని ప్రజలు తరిమికొట్టినా ఆ పార్టీ నేతలకు ఇంకా బుద్ధి రాలేదని ఎద్దేవా చేశారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు

వైకుంఠపురంలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. శ్రీనివాసులురెడ్డి, అలీసాహెబ్, నాయబ్ తదితరులకు ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సరీలకు అనుమతి తప్పనిసరి

వింజమూరు (ఉదయగిరి): వింజమూరు, కలిగిరి మండలాల్లోని నర్సరీ నిర్వాహకులు ఆంధ్రప్రదేశ్ నర్సరీ చట్టం 2010 నిబంధనల ప్రకారం తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వింజమూరు ఉద్యానశాఖ అధికారి షేక్ షమీల్ తెలిపారు. వింజమూరు రైతుభరోసా కేంద్రం-1లో శుక్రవారం ఆయన నర్సరీ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్సు లేని నర్సరీ నిర్వాహకులకు నోటీసులిచ్చామన్నారు. మొక్కలు విక్రయించేటప్పుడు అన్ని వివరాలతో కూడిన బిల్లులను రైతులకు అందజేయాలన్నారు. నర్సరీ రిజిస్ట్రేషన్‌కు అవసరమైన దరఖాస్తు ఫారం వింజమూరు ఉద్యానశాఖ కార్యాలయంతో పాటు రైతుభరోసా కేంద్రాల్లో కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. నర్సరీ నిర్వాహకులు అప్లికేషన్‌తో పాటు అవసరమైన పత్రాలు సమర్పించి ఈ నెల 28లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వీఏఏలు, నర్సరీ యజమానులు పాల్గొన్నారు.

వాగుపోరంబోకు భూముల పరిశీలన



ఆత్మకూరురూరల్: మండలంలోని గండ్లవేడులో అనాధిగా దళితులు సాగు చేసుకుంటున్న వాగు పోరంబోకు భూములను ఆత్మకూరు జలవనరులశాఖ ఈఈ ఆర్ వెంకటేశ్వర్లు శుక్రవారం క్షేత్ర పరిశీలన చేశారు. ఇటీవల ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గండ్లవేడు ఎస్సీ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా దళితులు తాము సాగు చేసుకుంటున్న వాగుపోరంబోకు భూములకు డీ ఫారం పట్టాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో క్షేత్ర పరిశీలన చేసిన ఈఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. కార్యక్రమంలో ఏఈ సురేష్‌చంద్ర, స్థానిక సర్పంచ్ మాముదూరు నరసింహులు పాల్గొన్నారు.

చక్కర లోడు లారీ బోల్తా



ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం పొంగూరుకండ్రిక సమీపంలో 67వ నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం చక్కెర లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో లారీ ముందు భాగంగా నుజ్జునుజ్జు కాగా ప్రకాశం జిల్లా కొమరోలుకు చెందిన లారీడ్రైవర్ మస్తాన్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చాలా సేపు శ్రమించి డ్రైవర్‌ను వెలికి తీసి పోలీసు హైవే వాహనంలో ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోమశిలలో 52.025 టీఎంసీలు

చేజర్ల (సోమశిల): జలాశయంలో శుక్రవారానికి 52.025 టీఎంసీలు ఉన్నాయి. 272 క్యూసెక్కుల వంతున వరద వస్తోంది. పెన్నార్‌డెల్టాకు 350, ఉత్తర కాలువకు 400 దక్షిణ కాలువకు 50 కండలేరుకు 300 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు.

కుటుంబ డాక్టర్‌తో అందరికి వైద్యం

- కలెక్టర్ హరినారాయణన్



నల్లపరెడ్డిపల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

ఆత్మకూరురూరల్: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికి వైద్యసేవలు అందించడమే లక్ష్యమని కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. మండలంలోని నల్లపరెడ్డిపల్లి కమ్యూనిటీ హాలులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించేటప్పుడు ముందస్తు సమాచారం ఇవ్వడం ద్వారా ప్రజలకు ఈ కార్యక్రమంపై అవగాహన పెంచాలని వైద్యులకు సూచించారు. రక్తహీనత కలిగిన చిన్నారులు, మహిళలు, గర్భిణులు, షుగర్ వ్యాధిగ్రస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకొనేందుకు వచ్చిన గ్రామస్తులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సదుపాయల సౌకర్యంపై అడిగి తెలుసుకున్నారు. బట్టేపాడు పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి రికార్డులు పరిశీలించారు. రిజిస్టర్ల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారంతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య డేటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఎవరైనా అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పొందుతున్న గర్భిణీలు, బాలింతల ఇళ్లకు వెళ్లి వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద వారికి అందుతున్న పోషకాహారాలను అడిగి తెలుసుకున్నారు. బట్టేపాడు ఎస్సీకాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద మంజూరైన సైడ్‌కాలువల నిర్మాణాలను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, ఐసీడీఎస్ పీడీ సౌజన్య, బట్టేపాడు సర్పంచ్ చెరుకూరు చిన చెంచయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- అనంతసాగరం, మర్రిపాడు మండలాల రెవెన్యూ సమస్యలపై సమీక్ష



రెవెన్యూ, భూ సమస్యలపై సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, ట్రైయినీ కలెక్టర్, ఆర్డీఓలు

ఆత్మకూరు: నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇప్పటి వరకు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అనేక రెవెన్యూ సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వాటి పరిష్కారం కోసం మండలాల వారీగా జాయింట్ కలెక్టర్, ఆర్డీఓలతో కలిసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం అనంతసాగరం, మర్రిపాడు మండలాల రెవెన్యూ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ట్రెయినీ కలెక్టర్ మహేష్, ఆర్డీఓ సాధు కరుణకుమారితో కలిసి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆయా మండలాల రెవెన్యూ అధికారులు, సంబంధిత రైతులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ సాదాబైనామా, చుక్కల భూముల సమస్యలపై నెలకొన్న వివాదాలు పరిష్కారమవుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నెలలో విడుదల చేసిన జీఓ నంబరు 163తో చుక్కల భూముల సమస్య పరిష్కారానికి నోచుకుందన్నారు. నియోజకవర్గంలో 17 వేల ఎకరాల చుక్కల భూములు ఉండగా, వాటిలో 15 వేల పైగా ఎకరాల సమస్య పరిష్కారమై త్వరలోనే వారికి పాసుపుస్తకాలు అందజేయడంతో పాటు బ్యాంకు రుణాలు పొందేందుకు సౌలభ్యం ఏర్పడిందన్నారు. మిగిలిన సుమారు 2 వేల ఎకరాలు సాంకేతిక సమస్యతో కొంత ఆలస్యంగానైనా పరిష్కారం అవుతుందన్నారు. ఏళ్ల తరబడి పేరుకొని ఉన్న రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తుండడం మంచి ఫలితాలు ఇవ్వనుందని రైతులకు మేలు జరగనుందని ఆయన అన్నారు. పార్టీలకు అతీతంగా పారదర్శకంగా రెవెన్యూ అధికారుల సహకారంతో పరిష్కార చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతసాగరం మండలంలో కొన్ని వివాదం నెలకొన్న భూములను సర్వే చేయాలని, పూర్తి నివేదిక అందజేయాలని ఆర్డీఓ కరుణకుమారి ఆ మండల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, పట్టణ పార్టీ నాయకులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, సొసైటీ అధ్యక్షుడు ఎస్.ప్రతాప్‌రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, ఐవీ రమణారెడ్డి, అనంతసాగరం, మర్రిపాడు మండలాల నాయకులు పాల్గొన్నారు.

రంజాన్ ప్రార్థనలకు ఏర్పాట్లు

- పరిశీలించిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



ఆత్మకూరు: రంజాన్ పర్వదినం నేపథ్యంలో పట్టణంలోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. మైదానం మొత్తం పందిళ్లు ఏర్పాటు చేశారు. వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పనులను ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పార్టీ నాయకులు, మున్సిపల్ అధికారులతో కలిసి శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. తాగునీటి వసతి మైదానంలో పలు చోట్ల ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకట రమణమ్మ, వైస్ చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, డాక్టర్ ఆదిశేషయ్య, ఐవీ రమణారెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు: మండలంలోని పలు గ్రామాల్లో రంజాన్ ప్రార్థనలకు ముస్లింలు ఈద్గాలు, మసీదులను ముస్తాబు చేశారు. శనివారం రంజాన్ పర్వదినం పురస్కరించుకుని మండలంలోని దుత్తలూరు బీసీకాలనీ, నర్రవాడ, లక్ష్మీపురం, కమ్మవారిపాళెం, ఏరుకొల్లు, నందిపాడు, తదితర గ్రామాల్లో మసీదులకు విద్యుద్దీపాలంకరణ చేసి ముస్తాబు చేశారు. ఈద్గాలకు రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు.

ఘనంగా ఇఫ్తార్ విందు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్ 19వ వార్డు మసీదు వద్ద శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. స్థానిక కౌన్సిలర్ కొండా స్వరూపరాణి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లుతో కలిసి పలువురు ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపి ఇఫ్తార్ విందు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాధిక్ హుస్సేన్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సాగు, తాగునీరు సక్రమంగా అందేలా చూడండి

- కలెక్టర్ హరినారాయణన్



బ్యారేజీను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

సంగం: జిల్లా ప్రజలకు సాగు, తాగునీటిని సక్రమంగా అందించేలా ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల నిర్వహణ పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తెలుగు గంగ ప్రాజెక్ట్ సీఈ హరినారాయణరెడ్డి, సోమశిల ఎస్ఈ వెంకటరమణారెడ్డితో కలిసి సంగంలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీని సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ బ్యారేజ్‌కు అనుసంధానంగా చేపట్టిన ఇరిగేషన్ కెనాల్స్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కొరిమెర్లలో కలెక్టర్ పర్యటించారు. రక్తహీనత ఉన్న గర్భిణులు, తక్కువ బరువు, ఎత్తు ఉన్న పిల్లల ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని, వారు వాడుతున్న మందులను గురించి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద పౌష్టికాహారం అందిస్తుందని, ఎనిమియా నివారణకు గర్భిణులకు సరైన విధానంలో పౌష్టికాహారం, మందులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సిమెంట్ రోడ్డు పనులను పరిశీలించారు. ఆయన వెంట ఐసీడీఎస్ పీడీ సౌజన్య, సీడీపీఓ పద్మ, సంగం తహసీల్దారు లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీ



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న నిర్వాహకులు



రంజాన్ తోఫా అందజేస్తున్న మోహన్ రెడ్డి

ఉదయగిరి: రంజాన్‌ను పురస్కరించుకుని ఉదయగిరిలో దిలార్‌భాయి వెల్ఫేర్ రిలీఫ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. నలభై మంది పేదలకు రూ.700 విలువ చేసే వస్తువులతో పాటు ఒక్కో కుటుంబానికి రూ.500 నగదు అందజేశారు. ప్రతి ఏడాది రంజాన్ సందర్భంగా తమ సంస్థ తరఫున పేదలకు రంజాన్ తోఫాగా అందిస్తున్నామని నిర్వాహకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో దాతలు దస్తగిరి అహ్మద్, జాఫర్‌అహ్మద్, మీరామొహీద్దీన్, నజీర్ అహ్మద్, జమాతే ఇస్లామిక్ నాయకులు నస్రుల్లా, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): రంజాన్ సందర్భంగా మర్రిపాడు మండలం చిలకపాడులో 35 పేద ముస్లిం కుటుంబాలకు మండల జేసీఎస్ కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి శుక్రవారం రంజాన్ తోఫా అందజేశారు. స్థానిక సర్పంచ్ రమాదేవి, బొర్రా విష్ణువర్ధన్‌రెడ్డి, గిరిరెడ్డి, సిద్ధంరెడ్డి మురళీ, అన్వర్ పాల్గొన్నారు.

లైంగికదాడి యత్నం కేసులో వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ గిరిబాబు

వరికుంటపాడు: మండలంలో తూర్పుచెన్నంపల్లికు చెందిన ఓ యువతిపై లైంగిక దాడి యత్నం కేసులో తిపిరిబోయిన లక్ష్మీనారాయణను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సీఐ వి.గిరిబాబు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ విలేకరల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తూర్పుచెన్నంపల్లికి చెందిన ఆశ కార్యకర్త ఓ గర్భిణిని కాన్పు కోసం ఈ నెల 14న తిపిరిబోయిన లక్ష్మీనారాయణ కారులో ఆత్మకూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లి చేర్పించారు. తిరిగి ఆశ కార్యకర్త, లక్ష్మీనారాయణ కారులో గ్రామానికి వచ్చారు. ఈ నేపథ్యంలో మార్గమధ్యంలో ఆశ కార్యకర్తతో అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు, లైంగికదాడి యత్నానికి పాల్పడినట్లు ఈ నెల 17న బాధితురాలు వరికుంటపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టగా శుక్రవారం ఉదయం లక్ష్మీనారాయణను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశామని కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. ఎస్సై, సిబ్బందిని అభినందించారు. ఎస్సై విజయ్‌శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

29న సర్వసభ్య సమావేశం

చేజర్ల(సోమశిల): ఈ నెల 29న శనివారం అనంతసాగరం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం జరుగునని ఎంపీడీఓ ఏ మధుసూదన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి మండలఅధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

మరింత మెరుగ్గా పొదుపు సేవలు

- సాంబశివారెడ్డి, పీడీ



ఆత్మకూరు: భవిష్యత్‌లో పొదుపు సంఘాల కు మరింత మెరుగైన సేవలు పారదర్శకంగా అందించేందుకు ఎస్‌ఆర్‌ఎల్‌ఎం లోకోయాప్ ద్వారా వీలు కలగనుందని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కేవీ సాంబశివారెడ్డి అన్నారు. ఆత్మకూరులోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో జరుగుతున్న లోకో యాప్‌పై శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశా యి. పీడీ సాంబశివారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పొదుపు సంఘాలను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఎక్కడ నుంచైనా పొదుపు లావాదేవీలు పరిశీలించుకునేందుకు వీలుగా ఈ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. సెర్ప్ ఆధ్వర్యంలో ఆత్మకూరు డివిజన్ పరిధిలోని 12 మండలాల ఎంపిక చేసిన ఏపీఎంలు, సీసీలు, వీవోఏలకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. వీరు ఆయా మండలాల్లో మిగిలిన సిబ్బందికి శిక్షణ ఇస్తారన్నారు. మే 15వ తేదీలోపు శిక్షణ పూర్తవుతుందని జూన్ 16వ తేదీలోగా పొదుపు సంఘాల, సభ్యుల పూర్తి వివరాలను ఈ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. త్వరలో కందుకూరు, నెల్లూరు డివిజన్ ఇందుకూరుపేటలో శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆత్మకూరు, ఉదయగిరి ఏరియా కో-ఆర్డినేటర్లు పి వెంకటేశ్వర్లు, జి.శేషారెడ్డి, డీఆర్‌డీఏ నుంచి శిక్షకులు పి చిన్నయ్య, కాంతారావు, మోహన్‌రావు, హరి, మస్తానమ్మ, ఏపీఎంలు బి.వెంకమ్మ, బుజ్జమ్మ, వెంకట రమణమ్మ పాల్గొన్నారు.